క్లుప్తంగా

విశ్వరూప్, శ్రీకాంత్‌కు సత్కారం



మాజీ మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న రోహిత్‌వర్మ

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవిలో తనను నియమించేందుకు కృషి చేసిన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను దంతులూరి రోహిత్‌వర్మ బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోహిత్‌వర్మను విశ్వరూప్, డాక్టర్ శ్రీకాంత్ అభినందించారు. జిల్లాలో యువతను పార్టీ పట్ల ఆకర్షితులయ్యేలా మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. భట్నవిల్లిలో విశ్వరూప్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ నాయకులు కల్వకొలను ఉమ, బిళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

డ్రోన్ సాంకేతికతతో వ్యవసాయం



నంగవరంలో రైతులకు డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రైతులకు సులువుగా పిచికారీ చేసేలా డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయని, సాగులో డ్రోన్ సాంకేతికతను జోడించి వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవాలని కేంద్ర వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ) ప్రధాన శాస్త్రవేత్త కె.రాజశేఖరరావు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా నంగవరం గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ సాగుపై రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సంజయ్, మాధవన్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ, భూసార పరీక్షలు తప్పనిసరిగా రైతులు చేయించాలన్నారు. పలు కేంద్ర, రాష్ట్ర పథకాలు, వాటి ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం డ్రోన్ వినియోగంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమలాపురం ఏడీఏ ఎంఏ షంషి, మండల ఏవో జి.కుమార్‌బాబు, సర్పంచ్‌లు జిన్నూరి వెంకటేశ్వరరావు, చిక్కం జంగమయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలో బండారులంక పంచాయతీలో సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై గంగాభవాని మాట్లాడుతూ, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు ఓటీపీలు ఎవరికీ చెప్పరాదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, మాడా మాధవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ప్రలోభాలకు మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నందివర్ధన

తాళ్లరేవు: ఇటీవల కాలంలో మహిళలను ప్రలోభాలతో మోసం చేస్తున్న వారు పెరిగారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని భీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మహిళల సమస్యలు, జెండర్ ఆధారిత హింస అనే అంశాలపై మహిళలకు, కౌమార బాలికలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రలోభాలకు గురికాకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వారిని ధైర్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



ఇంటి సామగ్రిని అందజేస్తున్న వెంకట్ తదితరులు

యానాం: చినవలసల గ్రామంలో ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబానికి యానాం డెయిరీస్ వెంకట్ మల్లాడి ఆధ్వర్యంలో బుధవారం గృహోపకరణాలను అందజేశారు. రూ.50 వేలు విలువైన సామగ్రిని బాధితుడు మల్లాడి రాంబాబు కుటుంబానికి అందించారు. ఇందులో మంచం, బీరువా, ఫ్రిజ్, గ్రైండర్ తదితర వస్తువులున్నాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందజేసినట్లు వెంకట్ తెలిపారు.

వంచనలో సూపర్ సిక్స్

- ప్రజలను నమ్మించి, మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- మోసాలను ప్రశ్నించేందుకే వెన్నుపోటు దినం
- వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ విశ్వరూప్, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్
- నిరసనకు పోటెత్తిన జనం, పార్టీ శ్రేణులు
- భారీ మోటార్ బైక్ ర్యాలీ



మోటార్ బైక్ ర్యాలీలో మాజీ మంత్రి విశ్వరూప్, కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న విశ్వరూప్, డాక్టర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం రూరల్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిన సీఎం చంద్రబాబునాయుడు మోసాలు, అరాచకాలు, అన్యాయాలకు పాల్పడ్డారంటూ వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ పార్టీ శ్రేణులు సోమవారం వెన్నుపోటు నిరసన దినం కార్యక్రమంలో కదంతొక్కారు. కూటమి ప్రభుత్వ మోసాలపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం అమలాపురం మండలం భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో విశ్వరూప్‌తో పాటు, పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ర్యాలీలో పాల్గొన్నారు. భట్నవిల్లి, ఎర్రవంతెన, నల్లవంతెన బైపాస్ రోడ్డు, నల్లవంతెన మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. వేలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్–6 పథకాలు ఇస్తానని ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని పార్టీ శ్రేణులు నిలదీశారు. ఈ సందర్భంగా విశ్వరూప్, డాక్టర్ శ్రీకాంత్‌తో పాటు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు డీఆర్‌వో రాజకుమారికి వినతిపత్రం అందించారు.

ప్రజలకు నిలువునా మోసం: విశ్వరూప్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, దీనిపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు ముందున్నాయని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ధ్వజమెత్తారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలపై తాము ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంలో తగాదాల గురించి కూటమి నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడవడం దారుణమన్నారు.

ఒక్క హామీ నెరవేర్చలేదు: డాక్టర్ శ్రీకాంత్

ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం మోసాలు, అరాచకాలు, అన్యాయాలకు పాల్పడుతోందని డాక్టర్ శ్రీకాంత్ దుయ్యబట్టారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. అధికారంలోకి వచ్చాక కూడా హామీలు నెరవేర్చకపోవడం రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హామీలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచక పాలన, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, హామీలు ఎగ్గొట్టిన వైనాన్ని ఎండగడుతూ.. ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, దంగేటి రాంబాబు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సంసాని బుల్లినాని, గుత్తుల చిరంజీవిరావు, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, పార్టీ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి దంతులూరి రోహిత్‌వర్మ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన గణేష్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, రైతు విభాగం రాష్ట్ర నాయకులు మోటూరి సత్యంకాపు, మండలఉపాధ్యక్షుడు సూదా గణపతి, నాయకులు నాతి శ్రీనివాసరావు, కేతా భానుతేజ, చీకట్ల కిషోర్, ఈతకోట శ్రావణ్, రాజులపూడి మురళి, కూడిపూడి భరత్‌భూషణ్, నక్కా సంపత్‌కుమార్, పొగాకు శ్రీను, సర్పంచ్‌లు కడిమి చిన్నంరాజు, దాసరి అరుణకుమారి, చెల్లుబోయిన నాని, నక్కా అరుణకుమారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందించిన జగన్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ లబ్ధిని సామాన్య ప్రజలకు బటన్ నొక్కి నేరుగా అందించారు. ఇది పారదర్శకంగా సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. వైఎస్.జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కూటమి నేతలు అపహాస్యం చేశారు. అప్పులు చేసినా ఐదేళ్ల కాలంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే పెద్ద మొత్తంలో అప్పులు చేసినా ప్రజలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

చంద్రబాబుకు మోసం అలవాటే

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. జగన్ ప్రభుత్వం కన్నా చంద్రబాబు ఎక్కువ ఇస్తారని జనం ఆశపడ్డారు. కాని ఏడాది కాలంగా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. హామీలు ఇచ్చి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది.

– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

గళం విప్పి.. కదం తొక్కి..

- భారీఎత్తున వెన్నుపోటు దినం నిరసన
- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు
- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పార్టీ శ్రేణుల ర్యాలీ



ముమ్మిడివరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



ముమ్మిడివరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ముమ్మిడివరం: ఎన్నికల్లో అమలు సాధ్యం కాని హామీలిచ్చి.. కూటమి ప్రభుత్వం మోసం చేసిందంటూ ముమ్మిడివరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కదంతొక్కారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, మోసపూరిత వాగ్దానాలు చేశారని ఎండగట్టారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి భారీఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చారు. స్థానిక కాశి వాని తూము సెంటర్ నుంచి ప్లకార్డులను ప్రదర్శిస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాశి వాని తూము వద్ద డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేయగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, కూటమి నాయకులు మోసపూరిత హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సొంత మామను వెన్నుపోటు పొడిచి, మామ స్థాపించిన పార్టీని హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో అమలు చేయలేని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇచ్చి, అధికారం చేపట్టి ఏడాదైనా ఏ హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, పెన్మత్స చిట్టిరాజు, ఢిల్లీ నారాయణ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి బాలమునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, జగతా పద్మనాభం, పిన్నమరాజు వెంకటపతిరాజు, కోలా బాబ్జీ, బొంతు సత్యశ్రీనివాస్, కాదా గోవిందకుమార్, కాశి రామకృష్ణ రెడ్డి, శివన్నారాయణ, వేటుకూరి బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మున్సిపల్ కమిషనర్



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

అమలాపురం టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ బి.రాణి సంయుక్త, కార్యాలయ అధికారులు, సిబ్బంది బుధవారం సాయంత్రం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతామని ప్రతిజ్ఞ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని పట్టణ ప్రజలకు కమిషనర్ పిలుపునిచ్చారు. పర్యావరణ హితమైన పేపర్, వస్త్ర, నార సంచులను మాత్రమే వినియోగించాలని సూచించారు. మున్సిపల్ ఏఈ కె.వెంకటేష్, మేనేజర్ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ కమిషనర్‌గా రాణి సంయుక్త

కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు బదిలీతో ఇంత వరకూ ఇన్‌చార్జి కమిషనర్‌గా తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న రాణి సంయుక్త బుధవారం నుంచి ఫుల్ అడిషనల్ చార్జి(ఎఫ్ఏసీ)తో విధులు నిర్వర్తించేలా మున్సిపల్ రీజనల్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి.

విద్యార్థి విజయానికి తోడుగా తర్ల్



డీఆర్పీలకు కిట్లను అందజేస్తున్న ఏపీసీ మమ్మీ

అల్లవరం: అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించడంలో విద్యార్థికి టీచింగ్ ఎట్ రైట్ లెవల్(తర్ల్) తోడుగా నిలుస్తుందని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ అన్నారు. ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో తర్ల్ డీఆర్పీల మూడు రోజుల శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏపీసీ మమ్మీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలు, గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు తర్ల్ ఉపకరిస్తుందన్నారు. చదువు అంటే భయం లేకుండా, ఆనందంగా విద్యాభ్యాసం చేసే విధంగా చేయడమే దీని ముఖ్యోద్దేశమన్నారు. సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ శిక్షణ పొందిన డీఆర్పీలు త్వరలోనే క్షేత్ర స్థాయిలో 3, 4, 5 తరగతుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం ఏపీసీ మమ్మీ ఎస్ఆర్‌పీ, డీఆర్పీలకు టీఎల్ఎం కిట్లను అందజేశారు.

పీఆర్ డీఈఈకి పరామర్శ



సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వరూప్, సూర్యప్రకాష్ తదితరులు

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న పంచాయితీరాజ్ ప్రాజెక్ట్ అమలాపురం డీఈఈ అన్యం రాంబాబును మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. రామచంద్రపురం రూరల్ మండలం ద్రాక్షారామలోని డీఈఈ రాంబాబు స్వగృహానికి విశ్వరూప్‌తో పాటు, వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, పార్టీ నాయకులు పరామర్శించారు. డీఈఈ రాంబాబు తల్లి దివంగత సత్యవతి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం అధ్యక్షుడు సంసాని బులినాని పాల్గొన్నారు.

సెంటాక్ అడ్మిషన్ల ప్యానెల్

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో వివిధ ఎంబీబీఎస్ సహా నీట్ యూజీ(ప్రొఫెషనల్), యూసీ సైన్స్, కామర్స్, ఫైన్‌ఆర్ట్స్, డిప్లొమా ఇన్ హెల్త్‌సైన్స్, సాంకేతిక కోర్సులకు అడ్మిషన్లు నిర్వహించడానికి ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్యానల్‌ను ఏర్పాటు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎల్జీ ఆమోదం పొందాక 9 మంది సభ్యులతో కమిటీని నియమించింది. విద్యా కార్యదర్శి సెంటాక్ చైర్మన్‌గా, హెల్త్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, సెంటాక్ కన్వీనర్ అదే హోదాలో వ్యవహరిస్తారు.

అవకతవకలపై విచారణ జరపాలి

యానాం: అవుట్‌సోర్సింగ్ విధానం ద్వారా యానాం జిప్‌మెర్ ఆసుపత్రిలో ఇటీవలి నర్సుల నియామకం చేపట్టిన ప్రక్రియను నిలుపుదల చేసి, కొత్తగా రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ బుధవారం జిప్‌మెర్, పుదుచ్చేరి, డిప్యూటీ డైరెక్టర్, అడ్మినిస్ట్రేషన్(రిక్రూట్‌మెంట్ సెల్)కు ఫిర్యాదు చేసినట్లు విడుతలై చిరుతగలై కచ్చి(వీసీకే) పార్టీ యానాం శాఖ అధ్యక్షుడు మెల్లం శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. నర్సుల నియామక ప్రక్రియలో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. మాజీ ప్రతినిధి కనుసన్నల్లో నియామక ప్రక్రియ అంతా సాగిందన్నారు. ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యవిద్య అభ్యసించిన నర్సులను నియామకం చేయడం ద్వారా రోగులకు మంచి వైద్యం అందుతుందన్నారు. దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటికి ఇక్కట్లు

- ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె ప్రభావం
- ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న మున్సిపాలిటీ



మున్సిపల్ కాలనీ ప్రజలకు తాగునీరు తీసుకొచ్చిన ట్యాంకర్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని 50 మంది అవుట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెలో ఉండడం వల్ల పట్టణంలోని పలు వార్డులు తాగునీరు, వీధి దీపాల పరంగా ఎదురవుతున్న ఇబ్బందులతో ప్రజలు అసౌకర్యానికి గురువుతున్నారు. స్థానిక 27వ వార్డులోని కొన్ని ప్రాంతాలకు రెండు రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ వార్డు పరిధిలో ఉన్న మున్సిపల్ కాలనీకి చెందిన పలువురు నాయకులు, ప్రజలు తమ ప్రాంతాలకు తాగునీరు అందని కారణంగా ట్యాంకర్లతో నీరును పంపించాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో మున్సిపాలిటీ ఆ కాలనీకి ట్యాంకర్లతో తాగునీరును పంపించి ప్రజల దాహార్తిని తీర్చింది. వడ్డిగూడేనికి కూడా ట్యాంకర్లను పంపించారు. కార్మికనగర్‌కు మంగళవారం రాత్రి మున్సిపాలిటీ ఓ ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేశారు. తాగునీటి కోసం తహతహలాడుతున్న కార్మిక నగర్ ప్రజలు ఆ ట్యాంకర్‌లో నీరు పట్టుకునేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొద్దిపాటి తోపులాట జరిగి, గొడవ కూడా పడ్డారు. దీంతో వాటర్ ట్యాంకర్ చెక్ వాల్ విరిగిపోయిందని వాహన డ్రైవర్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

వీధుల్లో అంధకారం

కురసాల వారివీధి, ఏవీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రోజూ రాత్రి సమయాల్లో ఆయా వీధుల్లో అంధకారం అలుముకుంటోంది. పలు రోడ్లు, వీధుల్లో కొన్ని వీధిలైట్లు వెలిగినా మిగిలినవి వెలగటం లేదు. సాంకేతిక సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ లోపం కారణంగా కొన్ని వీధి దీపాలు పనిచేయడం లేదు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ వర్కర్స్‌కు మున్సిపల్ కౌన్సిలర్ బండారు గోవిందు, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు దొంగ చిన్నా, గోపీ రమేష్ సంఘీభావం తెలిపారు.

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు

- ఎస్పీ లేకపోవడంతో పేట్రేగుతున్న అక్రమార్కులు
- కీలక నిర్ణయాలు తీసుకోలేకపోతున్న పోలీసులు

యానాం: యానాంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) నియామకం జరగకపోవడంతో ఇటీవల పేకాట, పెట్రోలు, డీజిల్, మద్యం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా పెరిగాయని స్థానికులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం ఎస్పీ రాజశేఖరన్ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఎస్పీని నియమించలేదు. పుదుచ్చేరి నుంచి సైతం ఎవరూ రాకపోవడంతో కొద్ది నెలలుగా ఎస్పీ సీటు ఖాళీగా ఉంది. సీఐ, ఎస్సై స్థాయి అధికారులే పోలీసు యంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. దీంతో ఉన్నత స్థాయి నిర్ణయాలు తీసుకులేకపోతున్నారు.

వెలసిన పేకాట క్లబ్బులు

ఇటీవల పలు లాడ్జీల్లో పేకాట క్లబ్బులు ప్రారంభమయ్యాయి. యానాంలో సుమారు 25 వరకు లాడ్జీలు ఉండటంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలు ప్రాంతాలు, యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. నిత్యం రూ.కోటి మేర లావాదేవీలు జరుగుతున్నాయని చెబుతున్నారు. కొందరికి రోజువారీ మామూళ్లు చేరుతుండటంతో అంతా సాఫీగా సాగిపోతున్నాయి. సోమవారం అర్ధరాత్రి మున్సిపల్ లాడ్జీలో వంద మంది పేకాట ఆడుతున్న విషయం తెలియడంతో మున్సిపల్ కమిషనర్ అక్కడ దాడి చేశారు. ఇప్పటి వరకు పోలీసులు ఎవరినీ అదుపులోకి తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. 60 వేల జనాభాకు వివిధ విభాగాలకు చెందిన పోలీసులు 250 మంది వరకు ఉన్నారు.

పెరిగిన నేరాలు

ఇటీవలి పట్టణంలో తండ్రి, కొడుకు కలిసి ఓ వ్యక్తిని చాకుతో తీవ్రంగా గాయపరిస్తే, అతను గాయాలతో యానాం జీజీహెచ్‌లో చికిత్స పొందాడు. ఆ దాడి ఘటన తీవ్రతను తగ్గించి ఏమీ జరగలేదన్నట్లు వ్యవహరించారు. అనంతరం ఇద్దరిపై కేసులు పెట్టారు. అదేవిధంగా కేంద్ర పాలిత ప్రాంతం కావడంతో పెట్రోలు, డీజిల్‌లో వ్యాట్ తక్కువగా ఉండటం, లిక్కర్ సైతం చౌకగా లభిస్తుండటంతో అడ్డూఅదుపు లేకుండా ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుగుతోంది. కీలకమైన వారికి నెలవారీ మామూళ్లు అందుతుండటంతో ఈ తతంగం అంతా సాఫీగా సాగిపోతుంది.

శ్రీనివాసరావు మృతికి సంతాపం



శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు, వాకర్స్ మాజీ గవర్నర్, బాస్కెట్ బాల్ సంఘ కోశాధికారి పచ్చిగోళ్ల శ్రీనివాసరావు ఆకస్మిక మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం తెలిపారు. పాతికేళ్లగా అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో ఏటా వేసవిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణా తరగతులకు శ్రీనివాసరావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అధ్యక్షతన సంతాప సభలో శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. తొలుత శ్రీనివాసరావు చిత్రపటానికి ఎమ్మెల్సీతో పాటు, బాస్కెట్ బాల్ క్రీడాకారులు, వాకర్స్ నివాళులర్పించారు. కోచ్ ఆకుల ఉమామహేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కుడుపూడి బుజ్జి, వెటరన్ క్రీడాకారిణి మెహబూబ్ షకీలా, వాకర్స్ ప్రతినిధులు కుడుపూడి త్రినాథ్, చప్పిడి శోభన్‌బాబు, వాసర్ల సుబ్బారావు, ముంగర ప్రసాద్, చిప్పల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాపులపాలెంలో ఆధ్యాత్మిక శోభ

తాళ్లరేవు: కాపులపాలెం గ్రామంలో పునర్నిర్మించిన ధర్మశాస్తా అయ్యప్పస్వామివారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, ఇతర ఆగమ పండితుల ఆధ్వర్యంలో 15 మంది పుణ్య దంపతులతో పూజాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

ధర్మశాస్తా అయ్యప్పస్వామి, యంత్ర, శిఖర, రజిత, ధ్వజ, ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం ఉదయం 7.53కు నిర్వహించనున్నారు. సుముహూర్త సమయానికి యంత్ర స్థాపనలు జరుగుతాయని వేద పండితులు తెలిపారు. పూజాది కార్యక్రమాల అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారన్నారు. భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

అమలాపురం రూరల్: మండలంలో వన్నెచింతలపూడి గ్రామంలో ఎస్సీ మహిళపై దాడి చేసి, పరుష పదజాలంతో దూషించిన జంపన సుబ్బురాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ డిమాండ్ చేశారు. ఇంట్లో వంటకు వాడిన నీరు తమ పొలంలోకి వస్తుందన్న కారణంతో పచ్చిమాల అనంతను సుబ్బరాజు కొట్టడమే కాకుండా, కులం పేరుతో దూషించి, అసభ్యకరంగా ప్రవర్తించి, ఆమెపై దాడి చేయడం దారుణమన్నారు. బాధితురాలు గాయాలతో ప్రస్తుతం అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబ్బరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. కొన్ని కేసుల్లో కొంత మంది పోలీసులు రాజకీయ నాయకుల పలుకుబడితో నిందితుల పక్షాన వత్తాసు పలుకుతూ, కేసులను నీరుగారుస్తున్నారని ఆరోపించారు.